(తెలుగు కళా సమితి (మ్యాజెర్వీ) కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ)



# విలువ కట్టలేనిది

ఈసారి తాడో పేడో తేల్చుకుందామని నిశ్చయించుకునే బయల్దేరింది శివాని. చిన్న తమ్ముడి పెళ్ళితో తండ్రి బాధ్యతలన్నీ పూర్తయినట్లే. అందుకే బయల్దేరింది తమ్ముడి పెళ్ళికే అయినా ప్రయత్నాలు మాత్రం ముద్దానికి.

రైల్వే స్టేషనుకి వచ్చిన పెళ్ళికొడుకు శ్రీధర్‌ని చూసి "అదేమిటోయ్ నువ్వు వచ్చావు? ఈ రోజు నిన్ను పెళ్లికొడుకుని చేస్తున్నారు గదా!" అన్నాడు సుందరం.

'చిన్నక్క కూడా రానిదే ఎలా చేస్తారు? అయినా మీరిద్దరూ వస్తుంటే ఇంటికి తీసుకెళ్ళటానికి రాకుండా ఎలా వుంటాను?" సామాన్లు తీసుకుంటూ అడిగాడు శ్రీధర్.

'అంత దూరం నించి వచ్చిన వాళ్ళం ఈ కాస్త దూరం రాలేమా? ఏ పిల్లి అయినా ఎత్తుకుపోతుందా మీ ఊళ్లో?" అంటూ గట్టిగా నవ్వి భుజం తట్టాడు సుందరం.

సామాను కారులో పెడుతుంటే "కారెక్కడిదిరా?" అని అడిగింది శివాని.

"మా స్నేహితుడిదిలే. ఈ టైములో ఇలాంటి అవసరాలకని ఇక్కడుంచాడు" కారు స్టార్టు చేస్తూ చెప్పాడు శ్రీధర్.

*　　*　　*　　*

కారు గేటులోకి రాగానే అందరూ బిల బిలలాడుతూ బయటికి వచ్చారు. 'శివాని వచ్చింది' అంటూ. ఆ అభిమానానికి పొంగిపోయింది శివాని హృదయం. పెద్దక్క భవాని చిన్నక్క ఈశాని. పది రోజులు ముందుగానే పిల్లలతో సహా వచ్చారు. అన్నయ్య శ్రీహరి ఈ ఊళ్లోనే వ్యవసాయం చూసుకుంటున్నాడు. తను చదివిన డిగ్రీ చదువుకి వచ్చే ఉద్యోగపు జీతం రాళ్ళ బతుకు కన్నా వ్యవసాయమే హాయి అని అతని ఉద్దేశం. తండ్రిదీ అదే అభిప్రాయం. చిన్నవాడు శ్రీధర్ మాత్రం ఇంజనీరింగు పూర్తి చేసి కన్సల్టెన్సీ పెట్టుకుని తనకు సరిపడా సంపాదించుకుంటున్నాడు. మొదటి నుంచి చదువుకుంటూ కూడా వ్యవసాయం చూసుకుంటూ, తండ్రి హయాంలో కన్నా ఎన్నో రెట్లు పెంచిన అన్నగారికే పొలాలన్నిటినీ ఉండనీయమని తన సంపాదన తనకు చాలని అంటూ వుంటాడు. 'పెళ్ళయ్యాక కూడ ఆ అభిప్రాయం వుంటుందా?' అన్న అనుమానం వచ్చింది ఒక్క శివానికి మాత్రమే. కొంత కాలం క్రితం అయితే శివానికి కూడా అటువంటి అనుమానం వచ్చి వుండేది కాదు.

మధ్యాహ్నం భోజనాలయినాక తల్లి నడిగింది శివాని. "కట్నం తీసుకోటం లేదని నాన్నగారు రాశారు. పెళ్ళి ఖర్చులెట్లా?" అని.

"అదేమిటే అట్లా అంటావు? కట్నం తీసుకోనిదే పెళ్ళి చెయ్యలేనంత హీనంగా లేముగా?" అంది తల్లి.

"ఆడబడుచు లాంఛనాలు మాత్రం యధావిధిగా జరుగుతాయి" పరిహాసంగా అంది వదిన రాజ్యలక్ష్మి.

"నేనందుకు అడగటం లేదు" చిన్నబుచ్చుకుంది శివాని.

"కూతురికీ కొడుకుకీ సమానంగా ఆస్తి రాశారట వాళ్ళ నాన్నగారు. ఆ అమ్మాయికే చాలా ఆస్తి వుంటే ఇంక ప్రత్యేకంగా కట్నం ఎందుకు?" మేనత్త వెంకటలక్ష్మి తానేదో కొత్త విషయం కనుక్కున్నట్టుగా చెప్పింది.

"ఆస్తి ఇస్తే మాత్రం కట్నం ఇవ్వరా? దేని ముచ్చట దానిది" అప్పుడే అటు వచ్చిన మేనత్త భర్త ఒక చెణుకు విసిరి వెళ్ళాడు.

"కట్నం తీసుకోకూడదన్నది శ్రీధర్ ఆదర్శం. అతనికి రాధిక నచ్చింది. అమ్మాయికి ఆస్తి వుందన్న సంగతి తరువాత తెలిసింది." రాజ్యలక్ష్మి ఈ మాట అని అక్కడి నుంచి తప్పుకుంది. శివాని తల్లి కూడా కోడలినే అనుసరించింది. మేనత్త ఈ విషయాన్నే అందరితోనూ చర్చిస్తుంటే శ్రీశ్లాని వింటోంది. భారీ కట్నంతో బాగా ఆస్తి వున్న భర్తని కొనుక్కున్న పినతల్లి కూతురు జ్ఞాన ప్రసూనాంబ ఎంతో ఆసక్తికరంగా తన అత్తగారి తరపు బంధువు ఒకావిడ సంగతి చెపుతోంది. ఆవిడ అన్నదమ్ము

ఆదివారం సీరియల్

కొమ్మనాపల్లి గణపతి రావు

లతో సమానంగా ఆస్తిలో వాటా అడిగిందిట. వాళ్ళు మారు మాట్లాడకుండా ఇచ్చారుట. కాని పండగలకీ పబ్బాలకీ పెట్టుపోతలు లేకపోతే పోయె, పసుపు, కుంకం కూడా మానేశారుట. పైగా తండ్రి పోతే దహన క్రియల దగ్గర్నుంచీ అన్ని ఖర్చుల్లోనూ వాటా పంచుకోమన్నారుట. శివాని ఎంతో కుతూహలంగా వింటోంది. అటు వెడుతున్న భవానిని పిలిచి ''ఆడపిల్లకి కట్నం ఇవ్వటం మంచిదా? ఆస్తిలో వాటా ఇవ్వటం మంచిదా?'' అని అడిగింది మేనత్త.

''మంచి చదువు, బతకగల స్తోమత, ఈ రెండే తల్లితండ్రులు ఆడపిల్లలకైనా, మగ పిల్లలకైనా ఇవ్వాల్సింది. తల్లితండ్రుల ప్రేమాభిమానాలు, అన్నదమ్ముల ఆప్యాయతలు - వీటి ముందు ఆస్తులూ, కట్నాలూ చాలా అల్పం. ఆత్మీయతని పణం పెట్టనిది ఏదైనా మంచిదే'' అన్నది చదువుకున్నదీ, తెలివైనదీ, మంచిదీ, సమర్థురాలూ అని అత్తింటా, పుట్టింటా పేరున్న భవాని.

''ఏమిటో భవానీ! మీ ఇంట్లో వాళ్ళ మాటలూ, చేతలూ, ఊహలూ నాకెప్పుడూ అర్థం కావు'' అంది మేనత్త.

ఆ క్షణాన శివానికి తమని ప్రత్యేకమైన ఆదర్శాలతో పెంచిన తండ్రి మీద గౌరవం, తాము ఇతరులకన్నా ఎంతో ఉన్నతంగా వున్నామన్న గర్వం కలిగాయి.

* * * * *

నిద్రలు పూర్తయి వెడుతున్న రాధిక ''ఇంత మంచి మనుషుల మధ్యకి రావటం నిజంగా నా అదృష్టం'' అని అన్నప్పుడు ''అవతలి వాళ్ళ మంచితనం మన ప్రవర్తన మీద ఆధారపడి వుంటుంది'' అని భవాని తేల్చేసింది కానీ శివానికి మాత్రం మనసు కలుక్కుమంది. రాధికకి ఇంటినీ, ఇంట్లో వాళ్ళనీ పరిచయం చేస్తూ ఎవరూ వినకుండా తమని గురించి రాజ్యలక్ష్మి ఎంతో ఘనంగా చెప్పడం శివాని కళ్ళలోనూ, చెవుల్లోనూ పడకుండా తప్పించుకోలేదు. ఆ మాటల ప్రభావమే ఇది అని శివానికి అర్థమయ్యింది.

* * * * *

చీరలూ, లాంఛనాలూ ఘనంగా పుచ్చుకున్న శివాని వీడ్కోలివ్వటానికి స్టేషనుకి వచ్చిన మనుషులు కనుమరుగైన తర్వాత కూడా ఇంకా అటే చూస్తూ ఏదో లోకంలో వుంటే చూసి నవ్వుకున్నాడు సుందరం. కొంచెం సేపటికి కంట్లో ఏదో పడ్డట్టుగా నటిస్తూ కళ్ళు తుడుచుకుంటున్న శివానిని అడిగాడు ''ఏదో తేల్చేస్తానిసారి అన్నావు. ఏం తేల్చావు?'' అని.

''పోనిద్దురూ! మీ సంపాదన చాలు మనకి. మీ లాంటి భర్తని ఇచ్చాడు మా నాన్న. ఇంకేం కావాలి? ఆస్తిలో వాటా అడిగి ఇప్పుడే అర్జంటుగా మనం ఇల్లు కొనక్కర్లేదు'' శివాని మాటలు విన్న సుందరం ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ శివానియే అంది.

''వాటాయే కాదు. ఎంతడిగినా ఇస్తారనుకోండి. వాటాగా అడిగితే ఇప్పుడున్న ఆప్యాయత వుంటుందా? మా పుట్టింటి వారు పెట్టారు అని నేను ఘనంగా చెప్పుకునే పెట్టుపోతలుంటాయుంటారా?''

''పిచ్చిమొద్దూ! ముందు నేను చెపితే నీ బుర్రకెక్కలేదు. నీ లాయరు ఫ్రెండు నీ బుర్రలో దూర్చిన జాడ్యం ఇది. మీ వాళ్ళ మధ్య నాలుగు రోజులుండడమే దీనికి తగిన మందు అని నాకు తెలుసు'' శివాని చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు సుందరం.

సిగ్గుపడి తల వంచుకున్న శివాని నిట్టూర్పు రైలు పెట్టిన కూతలో కలిసిపోయింది.

\- నందివాడ అనంతలక్ష్మి

# ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## తెలుగు కళాసమితి, న్యూజెర్సీ

సంయుక్త ఆధ్వర్యంలో

## ఉగాదికి

## చిన్న కథలు-వ్యంగ్య చిత్రాల పోటీ

# 5,400 రూపాయల బహుమతులు

క్రిందటి సంవత్సరం నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక ద్వారా చిన్న కథ, కార్టూన్ విభాగాల్లో పోటీలు నిర్వహించతలపెట్టారు.

**కథలు**

ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలకు వరుసగా రు. 1000, రు. 700, రు. 400 బహుమతులుగా వుంటాయి. ఇవి కాక ఒక్కొక్క కథకు రు. 300 బహుమతి చొప్పున ఆరు కథలను, రు. 150 బహుమతి చొప్పున ఆరు కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేస్తాము.

## నిబంధనలు

* తెలుగువారి జీవిత చిత్రణ లక్ష్యంగా మీరు పంపే కథలు అమెరికాలోని ఆంధ్రులకు అర్థమయ్యేలా సులభ శైలిలో, సరళమైన భాషలో వుండాలి.

* వ్రాతలో కథ మూడున్నర అర ఠావులు వుండాలి.

* అనువాద కథలు, అనుకరిస్తూ చేసిన రచనలు స్వీకరించడం జరుగదు కనుక - రచయితలు తమ రచన(లు) అనువాదం, అనుసరణ కావని స్పష్టంగా పేర్కొంటూ హామీ పత్రాన్ని జతపరచాలి.

* ఒకరు ఎన్ని రచనలైనా పంపవచ్చు.

* కలం పేరు అచ్చులో వినియోగించేందుకు మాత్రమే పరిమితం. రచనతో పాటు పూర్తి చిరునామా విధిగా వుండాలి.

* ప్రచురణకు అంగీకరించని రచనలను తిప్పి పంపడం సాధ్యపడదు కనుక, స్టాంపులు అంటించిన కవర్లు జత వెయ్యనవసరం లేదు.

* బహుమతి రచనల గురించి, సాధారణ ప్రచురణల గురించి తుది నిర్ణయం సంపాదక వర్గానిదే.

* బహుమతి పొందిన కథలు, సాధారణ ప్రచురణకు ఎంచిన కథలు ముందుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో అచ్చయి, ఆ తరువాత న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి మాస పత్రిక 'తెలుగు జ్యోతి'లో నెలకొకటి చొప్పున ప్రచురితమౌతాయి. కార్టూన్ల ప్రచురణకు కూడా యిదే పద్ధతిని అనుసరిస్తాము.

* ఎంపికైన రచనలకూ, బహుమతి కథలకూ, బహుమతి పొందిన కార్టూన్లకూ పారితోషికం అందజేస్తున్నది న్యూజెర్సీ తెలుగు కళాసమితి.

## కార్టూన్ విభాగం

* 'కాప్షన్' లేని కార్టూన్లకు ప్రాధాన్యత వుంటుంది.

* ఒక్కొక్క కార్టూన్‌కు రు. 75 బహుమతి చొప్పున ఈ పోటీలో మొత్తం 8 కార్టూన్లను ఎంపిక చేస్తాము.

## కథలు కార్టూన్లకు గడువు తేదీ: ఫిబ్రవరి 28

—ఎడిటర్

చిరునామా: తెలుగు కళాసమితి, న్యూజెర్సీ వారి కథల పోటీ, ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, పోస్ట్ బాక్స్ నెం. 712, లబ్బీపేట, విజయవాడ-520 010.